# ఆసాయంత్రం

విజయవాడలో గవర్నరుపేట సెంటరు. సూర్యకాంతి వాలిపోగా, సందడి తల ఎత్తింది. రోడ్లు సజీవంగా చక్కదనాన్ని రూపొందించుకున్నాయి.

ప్రక్కజేబుల్లో చేతులు పెట్టుకొని, ప్రక్కగా నడిచిపోయే పిల్లకేసి చూస్తూ, పదహారు పళ్ళూ ప్రదర్శించిన శోభనాద్రి హఠాత్తుగా ఎదురుగ్గా ఉన్న కిళ్లీకొట్టులో వెంకటనారాయణ సిగరెట్ కొంటూ వుండటాన్ని చూడటం జరిగింది. అతని ప్రాణం పచ్చని మైదానంమీద పడుకొన్నట్లయింది.

"దొరికాడు దరిద్రదామోదర చక్రవర్తి రెండువందల రూపాయల రొక్కం రెండు మాసాల్లో ఇస్తానని పట్టుకెళ్ళాడు రెండు సంవత్సరాలు గడిచాయి. రెండు రూపాయలైనా బాకీ చెల్లుపెట్టాడా? ఎంత మోసం? అంతా మాటల తీపేగానీ, మళ్ళీ తెచ్చి ఇవ్వడం ఉందా? నడివీధిలో నిలబెట్టి పరువు ప్రతిష్ఠలు దుమ్ములో కలిసేట్టు దుయ్యబడతాను. వీడిబాబు ఎవరడ్డమొస్తారో చూస్తాను" అనుకుంటూ శోభనాద్రి ప్రక్కజేబులో చేతులు తీసి, పదహారు పళ్లనూ "కటకట" మనిపించి, సాగదీసి రెండు అంగలు వేశాడు. పన్నెండేళ్ళ కుర్రవాడు సైకిలుమీద సర్కసు ఫీటు చేస్తూ ముందుచక్రాన్ని సూటిగా శోభనాద్రి ఎదుర్రొమ్ముకు గురిపెట్టాడు.

శోభనాద్రి ఆ ప్రమాదాన్నుంచి తప్పించుకొని, తల సవరించుకునే సమయానికి ఎదురుగ్గా సిగరెట్ పొగను విడుస్తూ వస్తున్న రంగారావు తల పడ్డాడు. శోభనాద్రి గుండె క్షణంలో సగంసేపు ఆగిపోయిన గడియారం లాగైంది. అడుగు ముందుకు పడలేదు. కళ్ళు పక్క షాపులు చూశాయి. వెంకటనారాయణ ఊసే లేదు. ఖాళీగా నిలబడ్డ రిక్షాను చాటు చేసికొని గబగబా రోడ్డు అవతలకు వెళ్ళి బస్‌స్టాప్ దగ్గర ఆగివున్న గుణదల సిటీ బస్సును గప్‌చిప్‌గా ఎక్కాడు.

వెతకపోయిన తీగె కాలికే తగిలిందన్న తలపుతో రంగారావు శోభనాద్రి చిక్కాడనే సంతోషంతో – అక్కడకు వచ్చి చుట్టూ చూశాడు. వొచ్చే పోయే మనుషుల్నీ, రిక్షాలనూ, సైకిళ్ళనూ రోడ్డు ప్రక్కన షాపుల్నీ చూశాడు. శోభనాద్రి అంతు లేడు. ఆశ్చర్యపోయాడు రంగారావు. మనస్సులో కోపం మెర మెరలాడింది.

"అరె! క్షణంలో కనిపించి క్షణంలో మాయమయాడే! కలా! నిజమా! ఇంతలో ఎక్కడ తల చాటుచేశాడు? ఎంత దొంగ టక్కరి? మెడమీద కొచ్చిందనీ మూడు రోజుల్లో మల్లెపువ్వుల్లో పెట్టి డబ్బు యిస్తాననీ చెప్పి, మూడు నెలల క్రిందట చేబదులుగా రెండువందల రూపాయలు పట్టుకెళ్ళి ఒక్క రూపాయి ఇచ్చాడా! కంటికి కనపడ్డాడా! ఆలస్యానికి సంజాయిషీ చెప్పుకున్నాడా! ఏమీ లేకపోగా కనబడి కళ్ళల్లో కారం చల్లి క్షణంలో అదృశ్యమౌతాడా! ఎంత నమ్మకద్రోహం! ఎంత అవినీతి! ఏం అప్పుచేసి పప్పుకూడు తినకపోతే? తప్పించు కెళ్ళాడు దిక్కుమాలినవాడు. లేకుంటే, నడిరోడ్డుమీద చొక్కా కాలరు పట్టుకొని చెంపలు వాచేటట్లు చివాట్లు పెట్టేవాణ్ణి" అనుకున్నాడు రంగారావు సిగరెట్టు పిక్కను సైడుకాల్వలోకి విసిరివేస్తూ.

అతను ఆగివున్న సిటీ బస్సుకేసి నడుస్తూ వుండగానే – అదే బస్సులోంచి దిగివస్తూన్న నళిని ఎదురైంది. రంగారావు ప్రాణం తల్లక్రిందులైంది. అడుగులు తడబడ్డాయి. శోభనాద్రి రూపు మనస్సులోంచి – చెదరిన పక్షిలా లేచిపోయింది. ఆ స్థానాన్ని నళిని ఆక్రమించింది. ఆ క్షణంలో రంగారావుకు తక్షణ కర్తవ్యం అంతుపట్టలేదు. గుండె

గాలిలో దీపంకాగా, ఆలోచనలు అక్కరకు రాలేదు. అయినప్పటికీ – ఏదో విలువైన వస్తువు ఎక్కడో పెట్టి మర్చిపోయినట్లుగా గిరుక్కున వెనక్కు తిరిగాడు. గబగబా నడిచాడు మనుషుల్ని తప్పించుకుంటూ. స్వదేశీ సిల్కు ఎంపోరియమ్ ముందు రిక్షా నిలబడివుంటే – గబుక్కున అందులో ఎక్కి కూర్చుని పోనివ్వమన్నాడు. అతను రిక్షా ఎక్కటాన్ని నళిని చూసింది.

"ఛీ, ఛీ! మనుషుల్లో ఎంత అవినీతీ, మోసం ప్రబలిపోతోంది! ఇంటర్మిడియేట్ చదివేరోజుల్లో రంగారావును తను ప్రేమించింది. తనని గాఢంగా ప్రేమించినట్లు ప్రేమలేఖలు సాక్ష్యాలుగా నిలిచివున్నాయి. కొసకు అతన్ని నమ్మి, సంఘాన్ని, నీతినీ న్యాయాన్నీ కూడా ఖాతరు చేయకుండా – తన అందమైన శరీరాన్ని అతని చేతులకు ఇష్టమొచ్చిన రీతిగా స్వాధీనం చేసింది. చివరకు ఏం జరిగింది. కట్నానికి ఆశపడి తనను తృణీకరించి, మరో యువతిని పెళ్ళి చేసుకున్నాడుగా! ద్రోహి, దుర్మార్గుడు! యెన్నాళ్ళకు అగుపించాడు! చేసిన మోసానికి .. చెంప చెళ్లుమనిపిస్తే సరి, బుద్ధి వొస్తుంది అనుకుంటూ నళిని ఆ రిక్షాను సమీపించే సమయానికే ఆ రిక్షా సాగిపోయింది. ఇంకో రిక్షా వేసికొని అతన్ని వెంబడించాలని నళిని పట్టుదలతో ఖాళీ రిక్షాలకేసి చూసింది.

కాని అంతలోకే భవానీ జనరల్ స్టోర్సు ముందు నిలబడి వొచ్చే పోయే ఆడవాళ్ళను చూపులతో కట్టివేస్తూన్న కోటినాగుల్ని అకస్మాత్తుగా నళిని చూసింది. వెంటనే చలిజ్వరం ఆవహించినట్టు వొణికింది. భయం చాత ఏం చేయాలో, ఎట్లాతప్పించుకోవాలో తోచలేదు. అప్పటికప్పుడే కోటినాగులు ఆమెను చూసి, కలిసికొనేందుకు ఆదుర్దాపడుతున్నాడు. కాని అంతలో, అతనా రోడ్డుదాటుతూ వుండగా నిండుగా సరుకు వేసికొని పోతూవున్న లారీ అడ్డువొచ్చింది. ఆ అదునులో నళిని నేర్పుగా – కన్యకాపరమేశ్వరీ క్లాత్ ఎంపోరియమ్‌లోకి జొరబడింది. లారీ వెళ్ళగానే కోటినాగులు ఆమెకోసం పారజూశాడు. ఎక్కడా కనిపించలేదు.

"అరె! అప్పుడే అదృశ్యమైపోయిందే! ఎంతమాయలాడి! కళ్ళముందే కనబడి కన్ను మూసి కన్ను తెరిచే లోపలనే కనిపించకుండా

పోయిందే! ఎంత టక్కులాడి కాకపోతే ఆ రోజు సాయంకాలం, రాత్రికి వొస్తానని పది రూపాయల నోటు తీసికొని పత్తాలేకుండాపోయింది! ఎంత మోసం! నా సామిరంగ ఈ సెంటరులో దొరకాలి దానిని తలెత్తుకోకుండా అవమానం చేయాలి. అందుకే భయపడి ఎక్కడో దాక్కున్నది. అంత నీతిగల మనిషైతే – డబ్బు తీసికోవడం దేనికి? ఆపైన పడుపు కూటికి మోసం చేయడం దేనికి! తగిన శాస్తి చేయాలి. ఈ షాపుల్లో దేంట్లో జొరబడిందీ'' అనుకుంటూ కోటినాగులు ప్రతిషాపూ వెదకనారంభించాడు.

ఒక షాపులోంచి బయటకు వస్తుండగా కోటినాగులుకు సైకిలుమీద ఒస్తున్న జగన్నాధరావు అగపడినాడు. పైగా అతను తనని చూసినట్లుగా కూడా గ్రహించాడు. నిళినికోసం వెతికేపని మానుకొని, అతని కంట బడకుండా వుండేమార్గం కోసం ప్రక్కచూపులు చూడ నారంభించాడు. కోటినాగుల్ని కల్సుకుందామనే ఆవేశంలో జగన్నాధరావు సైకిల్ను – వీధిలో సందడిని మర్చిపోయి కబుర్ల కైలాసంలో వున్న ఇద్దరు మనుషులకు "డాష్" కొట్టగా, సైకిలుతోపాటు ముగ్గురూ సిమెంటు రోడ్డుపైని తాకారు. ఆ ఆలస్యంలో కోటినాగులు "శ్రీ ఇండియా" హోటల్లో జొరబడ్డాడు.

తీరా దుమ్ము దులుపుకొని, సైకిలు హ్యాండిల్ వంకర దీసికొని – కోటినాగులుకోసం ముఖం ఎత్తి చూడగా ఎక్కడ అవుపిస్తాడు ?

"చేతికి చిక్కినట్లే చిక్కి బురదమట్టలాగ తప్పించుకు పోయాడే కోటినాగులు! దొంగ వెధవ! ఈ సెంటరులోనే ఎక్కడో ముఖం తప్పించి వుంటాడు. ఇక్కడే తిష్ఠ వేస్తాను. బయటకు రాకపోతాడా! దొంగల్లో ఘరానాదొంగ. ఒక స్నేహితునివెంట మర్యాదగా భోజనానికి వొచ్చి, డ్రాయరుమీదవున్న చేతిగడియారాన్ని దొంగిలిస్తాడా! దొంగతనంలో ఎంత ఆరితేరాడు? కనబడితే పదిమందిలో పరువు తీస్తానని, భయపడి యెటో పారిపోయాడు. యెక్కడకుపోతాడు!" అనుకుంటూ జగన్నాధరావు ఓ నిమిషంసేపు ఎలక్ట్రిక్ స్తంభంచెంత నిలబడి వీధిలో వొచ్చేపోయే జనంకేసి విశ్రాంతిగా చూశాడు. కాని గమ్మత్తేమిటంటే –

జగన్నాధరావు అక్కడ ఆ నిమిషం కంటె ఎక్కువసేపు నిలబడలేక పోయాడు. దాపుగా ఆఫీసు మేనేజరు కారు హారన్ మ్రోగింది. ఆ మ్రోతకు త్రుళ్ళిపడినవాడై సైకిలెక్కి చకచకా సాగిపోయాడు లక్ష్మీ టాకీసుకేసి. కోటినాగులు సంగతి స్ఫురణకు రాలేదు.

ఆఫీసు మేనేజరు రంగనాధం, జగన్నాధరావు నిలబడ్డ, యెలక్ట్రిక్ స్తంభం దగ్గర కారు ఆపుజేసి అతని కోసం చుట్టూ కలియ జూశాడు.

జగన్నాధరావు అట్లాకనబడి యిట్టే మాయమైనాడే! తననుచూసే తప్పించుకొన్నాడా! అరివీడి ప్రయోజకత్వం పెద్ద కాలవలో కలవా! తనని బాగా మోసం చేశాడన్నమాట.

తల్లి చావు బతుకుల్లో ఉన్నదనీ, టెలిగ్రామ్ యిచ్చిందనీ తత్క్షణం వెళ్ళకుంటే ఆఖరి చూపు అందదనీ చెప్పి, మూడు రోజులు శెలవు మంజూరు చేయించుకొని వీధిలో పి కారు కొడుతున్నాడా! సుపీరియర్ ఆఫీసర్ను యింతగా మోసం చేస్తాడా! యెన్ని గుండెలు! యెంత సాహసం? ఛీ, ఛీ. లోకమంతా మోసమయం. యెవర్నీ నమ్మేందుకు ఆస్కారం లేకుండా ఉంది. పైగా తన కారు హారన్ విని సైకిల్ని ప్రక్కసందులకు పట్టించాడు. తప్పించుకు తిరగడమే ప్రధానంగా పెట్టుకొని బ్రతికే అసమర్ధులే అంతా'' అనుకుంటూ సిగిరెట్టు వెలిగించి రంగనాధం అటూ ఇటూ చూడ నారంభించాడు.

హఠాత్తుగా రంగనాధంకు శివా మెడికల్ స్టోర్సునుంచి గొడుగును చంకను బెట్టుకొని తన వంకే చూస్తూ వేగంగా వస్తూన్న వెంకటప్పయ్య కనబడటం జరిగింది. వెంకట రంగనాధం అర్జంటుగా యెక్కడికో వెళ్లాలన్నట్టు కారు స్టార్టు చేశాడు. మొగల్రాజపురం వెళ్ళేరోడ్డు పట్టించాడు.

తీరా వెంకటప్పయ్య రొప్పుకుంటూ, రోజుకుంటూ అక్కడికొస్తే ఏముంది నిరాశ తప్ప. దిగులుపడిపోయాడు.

తనని చూసే రంగనాధంగారు ముఖం తప్పించాడు. ఏం తనతో నిర్మొహమాటంగా, "మీ అబ్బాయికి మా ఆఫీసులో ఉద్యోగం యిప్పించటం నావల్లకాదు" అని చెప్పేస్తే తను ఆశను తీసేసుకుంటాడుగా. ఈ నానుడు బేరం దేనికి? పైగా పెద్ద ఆఫీసరు సంఘంలో యెంతో గౌర

గలవాడు. ఇట్టా అప్పు తీసుకున్నవాడిలా, నేరం చేసినవాడిలా మనిషిని చూడగానే పారిపోవటమా ? యెంత న్యూనత ?" అనుకున్నాడు వెంకటప్పయ్య.

కాని అంతలోనే రిక్షాలో వెళుతూన్న సుబ్బరామయ్య వెంకటప్పయ్యను కేకవేశాడు. వెంకటప్పయ్య వినిపించుకోకుండా గబగబా సమీపంలో పచారీ కొట్టులోకి జొరబడ్డాడు. కారణం – క్రితం ఓసారి వెంకటప్పయ్య సుబ్బరామయ్యకు వంద రూపాయలు చేబదులుగా ఇస్తానని వాగ్దానం చేశాడు. నోట్లు వ్రాయించుకొని ఇచ్చిన బాకీలకే మోక్షం లేకపోతే చేబదుళ్లు పెదరావూరు ఖాతాలకే జమ అని భావించిన వెంకటప్పయ్యకు ముఖం తప్పించడమే సమంజసంగా కనబడింది.

విజయవాడ గవర్నరుపేట సెంటరులో సాయంత్రం చివరదశకొస్తూంది. రంగు రంగుల విద్యుద్దీపాలతో సెంటరు శోభాయమానంగా ఉంది. కార్లూ, లారీలూ, రిక్షాలూ, సైకిళ్ళూ, వచ్చేపోయే మనుషులూ – నగరం నిద్రపోవడం లేదనటానికి సాక్ష్యాలను బలపర్చటం జరుగుతూంది కాని విభిన్న మన స్తత్వాలకు అలవాటుపడిన మనుషులు గురువింద గింజల రీతిగా తమతమ తప్పులన్నీ, పొరపాట్లనూ, అన్యాయాలనూ, మోసాలనూ, అవినీతి కార్యాలనూ దాచుకుంటూ మర్చిపోతూ, తమకు ఏవేవో అన్యాయాలు జరిగాయనీ, తమని యెవరో మోసగిస్తున్నారనీ లోకమంతా అక్రమంతోనూ, అవినీతితోనూ కూడుకుని వున్నదనీ అనుకుంటూ వ్యవహరిస్తూనే వున్నారు.

అందరికీ ఒకటేమార్గం – తప్పించుకు తిరిగే మార్గం !

(ప్రజామత)

—o—